క్లుప్తంగా

సుబ్బారాయుడి సేవలో బీజేపీ నాయకులు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని బీజేపీ రాష్ట్ర నాయకులు శుక్రవారం దర్శించుకున్నారు. నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రసాద్ పార్టీ పదవులు స్వీకరించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నట్లు వారు తెలిపారు.
మచిలీపట్నంటౌన్: చిలకలపూడిలోని పాండురంగస్వామి వారిని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రసాద్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా క్షీరాధివాసం

నాగాయలంక: స్థానిక తిప్పాలెంలో పునర్నిర్మితమైన రామాలయం, విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా రెండో రోజు శుక్రవారం బ్రహ్మశ్రీ గుండేపూడి నాగరాజ శేఖర శర్మ బ్రహ్మత్వంలో వేద మంత్రోశ్ఛరణల నడుమ 33 అధివాసములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పీటలపై కూర్చున్న పది జంటలు సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలకు 33 అధివాసములు పూర్తి చేశారు. అనంతరం విగ్రహాల గ్రామోత్సవం జరిగింది. శనివారం ఉదయం 11.11 గంటలకు విగ్రహాల పునఃప్రతిష్ఠ, మంత్రస్థాపన జరుగుతుంది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని అలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భీమా బాబూరావు తెలిపారు.

బీసీల చైతన్య స్రవంతి బీపీ మండల్

బీసీ సంక్షేమ సంఘం నేతల నివాళి



మచిలీపట్నంటౌన్: మాజీ ఎంపీ, సంఘ సంస్కర్త బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతి కార్యక్రమం శుక్రవారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల్ చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి బీపీ మండల్ అని పేర్కొన్నారు. దేశమంతా పర్యటించి బీసీల కష్టసుఖాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారన్నారు. బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలని పార్లమెంట్‌కు దాదాపు 40 సిఫార్సులను ఆయన అందజేశారని చెప్పారు. ఓబీసీ కోటాలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందటం బీపీ మండల్ కృషి ఫలితమేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం, నాయకులు కేకే చింతయ్య, నడకుదుటి వెంకటేశ్వరరావు, చేబోయిన కోటేశ్వరరావు, రాంబాబు, శ్రీను, శివ, దుర్గాప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణహోమంపై మౌనం వీడండి

కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి కృష్ణ



కోడూరు: మతం పేరుతో మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమంపై కేంద్ర ప్రభుత్వం మౌనం వీడాలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కూరపాటి కృష్ణ అన్నారు. శుక్రవారం కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనలను నిరసిస్తూ మండలంలోని ముందడుగు, హరిపురం, ఉల్లిపాలెం, దింటిమెరక గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మణిపూర్ ఘటనల ద్వారా కేంద్రం మత విద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తోందని విమర్శించారు. ఘటనలకు కారణమైన వారిపై కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధ్వంస రాజకీయాలకు వ్యతిరేకంగా దళిత, ఆదివాసీ, క్రైస్తవ, ముస్లిం మైనారిటీలు ఐక్య పోరాటాలు చేయాలని గ్రామాల్లో అవగాహన కల్పించారు. సమితి జిల్లా ఉపాధ్యక్షుడు పామర్తి వెంకటేశ్వరరావు, ముసలయ్య, మోర్ల రత్తయ్య, మరియమ్మ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తరకటూరులో పొలంబడి

గూడూరు: తరకటూరులో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖాధికారి జీవీ శివప్రసాద్ మాట్లాడుతూ 14 వారాల పాటు 30 మంది రైతులతో మండలంలోని అన్ని వ్యవసాయ సహాయకుల పర్యవేక్షణలో తరకటూరులో సేంద్రియ పొలంబడి జరుగుతుందన్నారు. శుక్రవారం ఒక చదరపు మీటరులో మొక్కల సాంద్రతను లెక్కించారు. ఆరోగ్యవంతమైన పైరును పెంచడం, మిత్ర పురుగులను సంరక్షించుకుంటూ ప్రతి వారం పొలాన్ని క్రమం తప్పకుండా పరిశీలించి రైతులను పొలం పనుల్లో నిష్ణాతునిగా చేయడమే లక్ష్యంగా వీఏఏలు పనిచేయాలని కోరారు. ఆర్బీకేల వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో వక్కలగడ్డ గ్రామం

- ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్లు
- శరవేగంగా ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణం



నూతన రహదారిని పరిశీలిస్తున్న సర్పంచ్ వల్లూరు ఉమా, ఏడుకొండలు



వక్కలగడ్డ గ్రామ సచివాలయం

వక్కలగడ్డ(చల్లపల్లి): చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విస్తృతంగా రహదారుల నిర్మాణం జరుగుతోంది. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అమూల్ పాల కేంద్రం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామంలో ఇప్పటికే రూ.39 లక్షలతో నూతన రహదారుల నిర్మాణం పూర్తి చేశారు.

ఎమ్మెల్యే నిధులతో రోడ్లు

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసింది. తద్వారా వక్కలగడ్డలోని మూడు ఎస్సీ కాలనీలు, రెండు బీసీ కాలనీల్లో నూతన సీసీ రోడ్లు నిర్మించారు. వెట్టివానిగూడెంలో రూ.4.05 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించారు. దొరవానిగూడెంలో రూ.4 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించారు. ఇదే కాలనీలో రూ.2.80 లక్షలతో మరో సిమెంటు రోడ్డు నిర్మించారు. బీసీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.4.30 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించారు. బీసీ కాలనీని ప్రధాన ఆర్ అండ్ బీ రోడ్డుకు అనుసంధానం చేస్తూ రూ.2.35 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించారు. బీసీ కాలనీలో మరో రూ.2.50 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించారు.

ఎంపీ నిధులతో రోడ్ల నిర్మాణం..

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వక్కలగడ్డ గ్రామానికి మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులతో బీసీ కాలనీలో రెండు సిమెంటు రోడ్లు నిర్మించారు. రూ.4.70 లక్షలతో ఒక సీసీ రోడ్డు, రూ.3.25 లక్షలతో మరో సీసీ రోడ్డు నిర్మించారు.

ఎస్సీ, బీసీ కాలనీల్లో ..

గ్రామంలో పంచాయతీ సాధారణ నిధులు రూ.9 లక్షలతో ఎస్సీ, బీసీ కాలనీల్లో తొమ్మిది జీఎస్‌బీ రోడ్లు నిర్మించారు. గ్రామంలో పేదల కాలనీలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో రహదారుల నిర్మాణంపై పంచాయతీ సర్పంచ్ వల్లూరు ఉమా, పాలకవర్గ సభ్యులు దృష్టి సారించి రహదారులను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నారు.



ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి

గ్రామంలో అభివృద్ధి పనులకు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే రమేష్‌బాబు సహకారం అందిస్తున్నారు. వక్కలగడ్డలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో 30 ఏళ్లుగా అనేక అంతర్గత రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ద్వారా రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఎంపీ బాలశౌరి మరో రూ.10 లక్షలు విడుదల చేశారు.

– వల్లూరు ఉమా, వక్కలగడ్డ సర్పంచ్



అభివృద్ధి ప్రదాత జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి ప్రదాతగా గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వక్కలగడ్డ గ్రామంలో ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్లు, జీఎస్‌బీ రోడ్ల నిర్మాణం జరిగింది. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అమూల్ పాల సేకరణ కేంద్రం నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి.

– మోతుకూరి ఏడుకొండలు, ఏఎంసీ డైరెక్టర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ మచిలీపట్నం డివిజన్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాత హౌసింగ్ బోర్డు, పీకేఎం కాలనీ, డ్రైవర్స్ కాలనీ, గుమస్తాల కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

నేడు కొంగంచర్లలో గడప గడపకు మన ప్రభుత్వం

పెడన: మండల పరిధి కొంగంచర్ల గ్రామ సచివాలయం పరిధిలో శనివారం ఉదయం 9 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని మంత్రి జోగి రమేష్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పాల్గొని గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. అలాగే సాయంత్రం 4 గంటలకు పెడన పట్టణంలోని దేవాంగ కల్యాణ మండపంలో నియోజకవర్గ పరిధిలోని 76 సచివాలయాల కన్వీనర్లతో సమీక్ష సమావేశం జరుగుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, సచివాలయ కన్వీనర్లు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటింటా వరలక్ష్మీ వ్రతాలు



భావదేవరపల్లిలో అన్నపూర్ణాదేవి అలంకరణ



వరలక్ష్మీదేవిగా విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ



బంటుమిల్లిలో కరెన్సీ నోట్ల అలంకరణలో కనకదుర్గమ్మ



కొక్కిలిగడ్డలో వరలక్ష్మీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



నీలిపూడిలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మీ అమ్మవారు

మోపిదేవి: మండలంలో ఇంటింటా వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలు పండ్లతో ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మీ దేవిని అందంగా అలంకరించి పూజించారు. 12 రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు.

నేత్రపర్వంగా పుష్పాలంకరణ మహోత్సవం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పుష్పాలంకరణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకుడు శ్రీహరి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో వరలక్ష్మీదేవి వ్రతం నిర్వహించి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

గ్రామంలోని పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు కొల్లిపర సుబ్బారావు అమ్మవార్లను, అయ్యవారిని ప్రత్యేకంగా అలంకరించి శ్రావణ పూజలు జరిపారు.
కోడూరు: కోడూరులో కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉల్లిపాలెం గోదా రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి, లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీ దేవి, కోడూరు కన్యాక పరమేశ్వరీ, కనకదుర్గమ్మ, గంగాభవానీ అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. ప్రతి ఇంటి వద్ద లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. అమ్మవారి ప్రతిమను నెలకొల్పి నైవేద్యాలను సమర్పించారు. ముత్తైయిదువులకు పండ్లు, పూలు అందించి సుమంగళిగా ఉండాలంటూ అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.
కృత్తివెన్ను: మండల పరిధిలోని కనకదుర్గమ్మ ఆలయాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. నీలిపూడిలోని మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. మండల వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకున్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

మచిలీపట్నంటౌన్: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నగరంలోని అమ్మవార్ల ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈడేపల్లి శక్తిగుడి, రాజుపేట ముత్యంగుడి, రేవతి సెంటర్‌లోని గంగానమ్మ గుడి, పాత రామన్నపేట కనకదుర్గమ్మ గుడి, బెల్లంకొట్ల వీధిలోని మహాలక్ష్మీ అమ్మవారి గుడి, ప్రధాన రహదారిలోని కనకదుర్గ గుడి, భాస్కరపురం త్రిశక్తిపీఠం తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వరలక్ష్మీ వ్రతం కావడంతో పూలు, పండ్లు ధరలకు రెక్కలొచ్చాయి.
బంటుమిల్లి: శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళా భక్తులు తమ ఇండ్ల వద్ద వరలక్ష్మీ వ్రతాలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముత్తయిదువులకు వాయన, తాంబూలాలు ఇచ్చి ఆశీస్సులు పొందారు. స్థానిక కనకదుర్గ నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజల కోసం భక్తులు బారులు తీరారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని కొత్త నోట్లతో సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ గరికపాటి కూనారావు పర్యవేక్షణలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.
పెడన: పట్టణ పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పైడమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. కన్యకా పరమేశ్వరి ఆలయం, గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం, శ్యామలాంబ దేవీ ఆలయంలో అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ ప్రభుత్వం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

మచిలీపట్నంటౌన్: భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సీపీఐ ప్రచార జాతా బస్సు యాత్ర శుక్రవారం మచిలీపట్నం చేరింది. ఈ సందర్భంగా లక్ష్మీటాకీస్ సెంటర్‌లోని ఓ కన్వెన్షన్‌హాల్‌లో భారత రాజ్యాంగం–హక్కుల పరిరక్షణ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశంలో రాజ్యాంగ వ్యవస్థ బీజేపీ కనుసన్నల్లో నడుస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఎవరు మాట్లాడినా వారిపై ఐటీ, సీబీఐ, ఈడీ దాడులు చేయిస్తూ బెదిరింపులకు దిగుతోందన్నారు. మణిపూర్ రాష్ట్రంలో జరిగిన యదార్థ ఘటనలను దాచిపెట్టి దేశ ప్రతిష్ఠను అక్కడి బీజేపీ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని చెప్పారు. తొమ్మిదేళ్లుగా కేంద్రంలో పాలన చేస్తున్న నరేంద్రమోదీ అన్ని రంగాలను చిన్నాభిన్నం చేశారన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి వ్యవస్థలను తన చెప్పు చేతల్లో పెట్టుకుని వికృతపాలన చేస్తున్నారని విమర్శించారు. రెండు కోట్ల ఉద్యోగాల హామీని విస్మరించి నాలుగు సంవత్సరాలకే పరిమితమైన అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టి యువతకు తీరనిద్రోహం చేశారని ధ్వజమెత్తారు. సమావేశంలో మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, చలసాని శ్రీనివాసరావు, ముప్పాళ్ల సుబ్బారావు, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ మతీన్ తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణ గృహం నుంచి బాలిక అదృశ్యం

పోలీసులు గుర్తించి నిర్వాహకులకు అప్పగింత

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండలం పోడు గ్రామంలోని న్యూ హరిజోన్స్ సేఫ్ హోం నుంచి అదృశ్యమైన 15 ఏళ్ల బాలికను కృత్తివెన్ను ఎస్ఐ గణేష్‌కుమార్ నేతృత్వంలో గుర్తించి నిర్వాహకులకు అప్పగించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పోడు గ్రామంలోని న్యూ హరిజోన్స్ సేఫ్ హోం నుంచి గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో బాలిక వెళ్లిపోయింది. హోం నిర్వాహకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి వారి సూచనలతో ఆరు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో బాలికను కంకిపాడు బస్టాండులో గుర్తించి కృత్తివెన్నుకు తీసుకువచ్చి నిర్వాహకులకు అప్పగించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తల్లితండ్రులపై బెంగతో ఇంటికి వెళదామని వెళ్లిపోయినట్లు బాలిక తెలిపిందని ఎస్ఐ వివరించారు. నాలుగు నెలల కిందట ఇదే న్యూ హరిజోన్స్ సేఫ్ హోం నుంచి నలుగురు బాలికలు అర్ధరాత్రి బయటకు వెళ్లిపోగా పోలీసులు వారిని గుర్తించి నిర్వాహకులకు అప్పగించారు. మరోమారు ఇటువంటి ఘటనే పునరావృతం కావడంతో సేఫ్‌హోం నిర్వహణపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సత్యాగ్రహం తూచ్.. బహిరంగ సభకే పరిమితం

దివిసీమ రైతు పోరుబాటకు స్పందన కరవు





వేదికపై బుద్ధప్రసాద్ : సభ జరుగుతుండగానే వెళ్లిపోతున్న నాయకులు, దర్శన మిచ్చిన ఖాళీ కుర్చీలు

అవనిగడ్డ: పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ పిలుపు నిచ్చిన దివిసీమ పోరుబాటకు రైతుల నుంచి స్పందన కరవైంది. సామూహిక సత్యాగ్రహం జరగలేదు. బహిరంగసభకే పరిమితమైంది. పులిగడ్డ అక్విడెక్టు వద్ద జరిగే సామూహిక సత్యాగ్రహానికి వేలాదిగా తరలి రావాలని నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో టీడీపీ విస్తృత ప్రచారం చేసినప్పటికీ రైతుల్లో స్పందన లేకపోవడంతో ఆ పార్టీ నాయకులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు.

ఇదేమి సత్యాగ్రహం..

రైతుల సమస్యలతో పాటు నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ సత్యాగ్రహం కార్యక్రమానికి పిలుపు నిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కావాల్సిన సత్యాగ్రహం మూడు గంటలు ఆలస్యంగా అంటే ఐదు గంటలకు ప్రారంభమైంది. మోపిదేవి వార్పు వద్ద సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన బుద్ధప్రసాద్ అక్కడి నుంచి ఎడ్లబండిపై సత్యాగ్రహం స్థలానికి చేరుకున్నారు. సత్యాగ్రహం అంటే అందరూ కూర్చుని నిరసన తెలుపుతారని భావించారు. కానీ వేదికపై బుద్ధ ప్రసాద్ కానీ, టీడీపీ నాయకులు కానీ ఎవరూ సత్యాగ్రహం చేయలేదు. అక్విడెక్టు రహదారిపై ఏర్పాటు చేసిన వేదికపైకెక్కి బహిరంగ సభలా జరిపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సన్మానాలకే ప్రాధాన్యత ఇచ్చారు. ఆరు మండలాల్లో విస్తృత ప్రచారం చేసినప్పటికీ నాయకులు, టీడీపీ కార్యకర్తలతో కలుపుకుని 300 మందిలోపే వచ్చారు. సభ ముగిసే సమయానికి 150 మంది లోపే ఉన్నారు. కార్యక్రమం ప్రారంభమైన అరగంటకే కొందరు ఇంటి దారి పట్టారు. దీంతో సగంపైగానే ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. పోరుబాట, సత్యాగ్రహం అంటూ విస్తృత ప్రచారం చేసిన టీడీపీ అలాంటిదేమీ చేయకుండానే నాయకుల ప్రసంగాలతో కార్యక్రమాన్ని ముగించారు.







ఆలోచింపజేసిన ఫ్లెక్సీలు

అవనిగడ్డ: టీడీపీ చేపట్టిన సత్యాగ్రహం కార్యక్రమం నేపథ్యంలో పులిగడ్డలో దివిసీమ రైతుల పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రజలను ఆకట్టుకోవడమే కాకుండా చర్చనీయాంశమయ్యాయి. పులిగడ్డ చౌరస్తా మలుపు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వీక్షకులను ఆలోచింప జేశాయి. ఒక ఫ్లెక్సీలో నాటి ప్రభుత్వంలో దివిసీమ రైతులు ఎదుర్కొన్న సాగు–తాగునీటి కష్టాలపై 'సాక్షి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనాల ఫొటోలు ఉండగా, పక్కనే నేటి ప్రభుత్వంలో దివిసీమ రైతుల పరిస్థితిపై పలు చిత్రాలు ఉన్న ఫ్లెక్సీ నాటి, నేటి పరిస్థితులను కళ్లకు కట్టాయి. రైతులకు మేలు చేయకుండా దొంగ దీక్షలా అంటూ ఏర్పాటుచేసిన మరో ఫ్లెక్సీని సత్యాగ్రహం కార్యక్రమానికి విచ్చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం ఆసక్తిగా తిలకించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు: గూడూరు మండలంలో ఖాళీగా ఉన్న వివిధ గ్రామాల్లోని 10 వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. మండలంలోని పినగూడూరులంక (1), కోకనారాయణపాలెం (1), గూడూరు (1), రామానుజవత్తర్లపల్లి (1), ఆకుమర్రు (2), పోలవరం (2), నారికేడాలపాలెం (1), కంకటావ (1) గ్రామాల్లోని వలంటీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తిగల వారు ఈనెల 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

బంటుమిల్లి: మణిమేశ్వరం గ్రామంలోని మహిళా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక, సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షురాలు తంగెళ్లమూడి కుసుమకుమారి, కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు 138 మంది రైతులకు రూ. 1,17,480లను పంపిణీ చేశారు.